

పట్టణ శివారు ఇళ్లే టార్గెట్.!

శివారు ఇళ్లే టార్గెట్‌గా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. గంజాయి ముఠా, బయటి రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల సంచారంతో ప్రజలు భయపడుతున్నారు. -8లో



దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా

వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం ఎస్.వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని పది ఎకరాల ప్రభుత్వ భూమిలో టీడీపీ కార్యకర్త యంత్రాలతో చదును చేస్తున్నాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.540
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 132 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నియామకం



మర్రి రవికుమార్

రాజంపేట: వైఎస్సార్ సీపీ పురపాలక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, రాజంపేట పురపాలక సంఘం వైస్ చైర్మన్‌గా మర్రి రవి కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్రకార్యాలయం నుంచి నియామకపు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని బుధవారం ఇక్కడి విలేకర్లకు మర్రి రవి తెలిపారు. మర్రి రవి ఎంపికపట్ల కాపు సామాజికవర్గానికి చెందిన పలువురు హర్షం వ్యక్తంచేశారు.

ఏఎఫ్‌యూలో 25న కౌన్సెలింగ్



కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఈ నెల 25న కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని విశ్వ విద్యాలయం వీసీ విశ్వనాథకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా బీఎఫ్ఏ (ఫోర్ ఇయర్స్ డిగ్రీ) ఫైన్ ఆర్ట్స్ (యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ, శిల్పం మరియు బి.డెస్ ఇంటీరియర్ డిజైన్) కోర్సులకు కౌన్సిలింగ్ ఉంటుదని వివరించారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 25వ తేదీ తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు కూడా డైరెక్ట్ అడ్మిషన్స్ కోసం ఒరిజినల్ (అసలు ధృవపత్రాలు) సర్టిఫికెట్స్ తో హాజరు అయి అదే రోజు అడ్మిషన్స్ పొందవచ్చుని తెలిపారు. సమాచాం కోసం www.ysrafu.ac.inను సందర్శించాలని వీసీ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు.

సెప్టెంబర్ 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం తదితరులు

రాయచోటి: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలను రాయచోటి డైట్ ప్రాంగణంలో సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం డైట్‌లో దీనికి సంబంధించిన పోస్టర్లను డీఈఓ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, కళా రూపాలను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9,10, 11,12 తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులను వివరించారు.ఇతర వివరాలకు జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి, ఫోన్ నెంబరు. 9440246825లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివ భాస్కర్, వెంకట సుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, కేదర్నాథ్, శివప్రసాద్, కలిముల్లా, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు



ప్రొద్దుటూరు క్రైం: నూతన బార్ పాలసీ ప్రకారం ఇక నుంచి బార్లలో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయని కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. డిప్యూటీ కమిషనర్, ఈఎస్ రవికుమార్ బుధవారం ప్రొద్దుటూరు ఎక్సైజ్‌స్టేషన్‌కు వచ్చారు. స్థానికంగా ఉన్న పాత బార్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 41 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. కడప జిల్లాలో 29, అన్నమయ్య జిల్లాలో 12 బార్లు ఉన్నాయన్నారు. ఈ నెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 28న బార్లకు డ్రా తీయనున్నట్లు తెలిపారు. గతంలో ప్రొద్దుటూరులోని బార్లకు లైసెన్స్ ఫీజు రూ. 1.45 కోట్లు ఉండగా ఇప్పుడు రూ. 55 లక్షలకు తగ్గించినట్లు చెప్పారు. సమయ పాలన పాటించని మద్యం షాపులు, బార్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొద్దుటూరులో గంజాయి అక్రమ రవాణా నిరోధానికి కృషి చేస్తున్న ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డిని అభినందించారు.

పెన్షన్.. టెన్షన్..

- దివ్యాంగుల పింఛన్లపై కత్తి కట్టిన కూటమి సర్కార్
- సుమారు 3742 మందికి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నోటీసులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



సంబేపల్లె: నోటీసులు అందడంతో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు



సాక్షి రాయచోటి: పెన్షన్‌పై టెన్షన్ తప్పలేదు. అందులోనూ సాధారణ పెన్షన్లలో కాదు...కాలో, చెయ్యి విరిగిన వారు కొందరు..మానసిక వికలత్వం కలిగిన వారు మరి కొందరు..మరుగుజ్జులుగా ఇంకొందరు...ఇలా చాలామంది దివ్యాంగుల వేదన, ఆవేదన వర్ణణాభరితం. ఎవరినీ కదిపినా ఏడుపులు...కన్నీళ్లతో కూడిన వేదన కనిపిస్తోంది. ఈనెలలో పెన్షన్లకు సంబంధించి అధికారుల చర్యలతో దివ్యాంగులు బెంబేలెత్తిపోతున్నారు. చాలామంది అర్హత లేకపోయినా దొంగ సర్టిఫికెట్లు, ఇతర అక్రమాలతో అర్హత సాధించి పెన్షన్ పొందుతున్నారని కూటమి సర్కార్ విచారణకు పూనుకుంది. అప్పట్లో వైఎస్సార్ సీపీ సర్కార్ దివ్యాంగుల విషయంలో మానవతా హృదయంతో వ్యవహారించడంతో అందరికీ పెన్షన్లు అందేవి. ప్రస్తుత సర్కార్ అనర్హులకు పెన్షన్ల పేరుతో ఏరివేతకు ముందడుగు వేయడంపై దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు.



గాలివీడు: ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు

ఆందోళనలో లబ్ధిదారులు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద ప్రతినెల 2,18,025 మందికి సంబంధించి రూ. 94.34 కోట్లు అందిస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా సుమారు 29 వేల మందికి పైగా దివ్యాంగులు పెన్షన్లు అందుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా శరీరంలో అవయవలోపాల నేపథ్యంలో పెన్షన్లు తీసుకుంటున్నారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం చాలా వరకు దివ్యాంగుల్లో దొంగ సర్టిఫికెట్లు పెట్టి పెన్షన్లు తీసుకుంటున్నారని విచారణకు ఆదేశించింది. దీంతో జిల్లాలోని అనేక మంది దివ్యాంగుల్లో పెన్షన్లు ఉంటాయో, ఊడుతాయోనన్న అందోళన వెంటాడుతోంది. ప్రతినెల ఠంఛనుగా పెన్షన్ అందుకునే వారిలో రానున్న నెలలో అందుకుంటామో లేదోనన్న బెంగ నెలకొంది.

3742 మందికి నోటీసులు

జిల్లాలోని దివ్యాంగులకు సంబంధించి డీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేశారు. మీరు దివ్యాంగులుగా ఉన్న నేపథ్యంలో మరొకమారు పూర్తి స్థాయిలో అవసరమైన వివరాలను పొందుపరచాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 3742 వేలమంది దివ్యాంగులకు వివిధ కారణాలతో నోటీసులు జారీ చేశారు. కొంతమంది దివ్యాంగులకు ఈనెలలోనే రూ. 6 వేల పెన్షన్ వస్తున్న జాబితా నుంచి తొలగిపోయి రూ. 4 వేల పెన్షన్‌లోకి మార్చినట్లు తెలుస్తోంది. వీరబల్లి మండలంలోని మట్లి గ్రామంలో సుమారు 45 మందికి పైగా దివ్యాంగులకు సంబంధించి పెన్షన్లు తొలగిస్తున్నారని తెలుసుకుని సర్పంచ్ నాగార్జున ఆచారి జిల్లా అధికారులనుకలిసి విన్నవించారు. ఒక్క మట్లిలోనే కాదు..జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది.

పెన్షన్ తొలగించామంటున్నారు



రీ -వెరిఫికేషన్‌లో భాగంగా పెన్షన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ అధికారులు నోటీసులు జారీ చేశారు. 2010లో నాకు సదరం సరిఫికెట్ మంజూరు చేశారు. అప్పటి నుంచి పెన్షన్ వస్తోంది. ఇప్పుడు పింఛన్ రద్దు చేస్తే నా జీవనోపాధి కోల్పోతాను. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

– సి.గంగాధర్, అరవీడు గ్రామం, గాలివీడు మండలం

పెంచడమెందుకు.. తొలగించడమెందుకు



పింఛన్లను తొలగించి దివ్యాంగులను ఈ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోంది. పింఛన్ పెంచడమెందుకు.. వాటిని తొలగించడమెందుకు. ఆగస్టు 1వ తేదీ వరకు పింఛన్ ఇచ్చారు. ఇప్పుడు రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ అధికారులు నోటీసులు జారీచేశారు. ఎంపీడీఓను కలిశాం.

– సాన పూర్ణమ్మ, కొత్తబండి వాండ్ల పల్లె,నూలివీడు, గాలివీడు మండలం

వివరాలు పొందుపరచండి

జిల్లాలో దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి నోటీసులు అందుకున్న వారు అర్హులుగా భావిస్తే తమ వివరాలను ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు సమర్పించాలి. అక్కడి అధికారులను కలిసి వాస్తవ పరిస్థితులు వివరించి అక్కడి నుంచి అప్పీలు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. జిల్లా వ్యాప్తంగా 3742 మందికి నోటీసులు ఇచ్చాం.

– సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

24 నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలకు సిద్ధం చేసిన యాగశాల

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని టీడీడీ అధికారులు బుధవారం తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఆగస్టు 23వ తేది సాయంత్రం ఆరు గంటలకు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 24న ఉదయం చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం పవిత్రహోమం, నివేదన, శాత్తుమొర జరగుతాయన్నారు. 25న ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 26న ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్ష, సాయంత్రం శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి ఉత్సవర్ల ఊరేగింపు జరుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ సి.రామ్మూర్తి బుధవారం తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారి పేర్లు మాత్రమే మెరిట్ జాబితాలోకి వస్తాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు ఈనెల 29వ తేదీ ప్రభుత్వ ఐటిఐలలో, 30వ తేదీ ప్రైవేట్ ఐటీఐలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన దేవునికడప బాలాలయం

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంతో బాలాలయ నిర్మాణం పూర్తయింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి దశ కింద రూ.15 లక్షలతో బాలాలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, అనంతరం తులాలగ్నంలో బాలబింబ ప్రతిష్ఠ, బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమాలను పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ భట్టర్, మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణ తరుణ్ నిర్వహించారు. అనంతరం బాలాలయంలో వెలిసిన స్వామి, అమ్మవార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



బాలాలయంలో స్వామి, అమ్మవార్ల ప్రతిష్ఠ



దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి


జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి: రెవెన్యూ అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులు, భూముల రీసర్వే, భూమి రికార్డుల శుద్ధి, రికార్డుల అప్‌డేషన్ తదితర అంశాలపై బుధవారం రాయచోటిలోని పంక్షన్ హాల్‌లో రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వీఆర్‌ఓలు, తహసీల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించిన పనుల్లో కొంత గ్యాప్ కనిపిస్తోందన్నారు. సరియైన పరిజ్ఞానం లేకపోవడం, తెలుసుకోవాలన్న జిజ్ఞాస లోపించడం వల్ల ఆలస్యాలు జరుగుతున్నాయని కలెక్టర్ అన్నారు. జిల్లాలో రీసర్వే జాయింట్ ఎల్పీఎంల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో 965 కుటుంబాలు రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారన్నారు. కోర్టు వివాదాలు, పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు మినహా ఇతర భూ వివాదాల పరిష్కారంలో అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా నిబంధనల ప్రకారం పనులు చేయాలనిఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష.. వివక్ష

- ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం నోటీసులు
- ఇల్లు కట్టకుంటే..మేమిచ్చిన డబ్బు వాపసు చేయండంటూ హుకుం జారీ
- ఇళ్లను రద్దు చేస్తామంటూ హెచ్చరికలు



పెద్దతిప్పసముద్రం మండలంలో మైనార్టీ బీసీ మహిళకు ఇచ్చిన నోటీసు



మదనపల్లె: పేదల ఇబ్బందులు తీర్చి, వారికి చేయూత ఇవ్వాల్సిన కూటమి ప్రభుత్వం కక్ష కట్టి వివక్ష చూపుతోంది. బడా పారిశ్రామిక వేత్తలకు, బడా సంస్థకు రెడ్‌కార్పెట్ పరచి వారికి అడిగినవి, అడగని రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం నిరుపేదలు, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంజూరైన ఇళ్లపై కక్ష కట్టింది. అంతటితో ఆగలేదు మీకు మేం డబ్బులిచ్చాం..ఇల్లు కట్టుకోలేదు..వెంటనే ఇంటి పనులు చేపట్టాలి, లేదంటే మేం మీ ఖాతాలకు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించండి. తర్వాత ఇంటిని రద్దు చేస్తామంటూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పేదలకు గృహనిర్మాణశాఖ నోటీసులు జారీ చేస్తోంది. వీటిని అందుకున్న పేదలు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

అడగకనే పెంచారు

జిల్లాలో 78,221 మందికి పక్కా గృహాలు మంజూరవ్వగా వారిలో 58,070 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారులు ఉన్నారు. ఎస్సీలు 12,188 మంది, ఎస్టీలు 3,432 మంది, బీసీలు 42,450 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. వీరికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఒక్కో లబ్ధిదారునికి అదనంగా మంజూరు చేశారు. ఈ నిధులను సబ్ ప్లాన్ నిధుల నుంచి కేటాయించారు. గుర్తించిన వారికి ఇంటి స్థాయిని బట్టి నిధులను రూ.15వేల నుంచి ఆపైన సొమ్మును వారి ఖాతాలకు జమ చేశా రు. ఇలా అదనపు నిధులను ఇవ్వాలన్న డిమాండ్లు లబ్ధిదారుల నుంచి లేనప్పటికి ప్రభుత్వం ఇచ్చేసింది.

నోటీసులతో అలజడి

మేం మీ ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు ఖాతాకు నిధులు జమ చేశాం, మీరు ఇంటి పనులు చేపట్టలేదంటూ గృహనిర్మాణశాఖ మండల స్థాయిలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, ఏఈ, ఎంపీడీఓ సంతకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు నోటీసులు పంపుతున్నారు. వీటిని అందుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం తరపున ఎంత మంజూరైంది, అదనంగా ఎంత చెల్లించారో తెలుపుతూ మీరు ఇంటిపని ఇంకా మొదలుపెట్టలేదు. నోటీసు అందిన వారంలోగా పని మొదలుపెట్టకపోతే ప్రభుత్వం వారి తరపున మీకు అందిన డబ్బులను తిరిగి వెన క్కి తీసుకుని, మీకు ఇల్లు అవసరం లేదని భావించి రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని మీకు తెలియజేస్తున్నాము అంటూ నోటీసుల్లో హెచ్చరికను జారీ చేశారు. దీంతో ఏం చేయాలో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మంజూరైన ఇంటిని రద్దు చేస్తే మళ్లీ ఇళ్లు రావన్న ఆందోళనలో ఉన్నారు. ఇస్తున్న నోటీసులు ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకే ఇవ్వడం విశేషం.

జిల్లాలో గృహ లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మొత్తం
రాయచోటి	2,040	496	11,186	13,722
పీలేరు	2,433	863	10,184	21,436
రాజంపేట	2,308	520	4,770	7,598
కోడూరు	1,897	612	2,306	4,815
తంబళ్లపల్లె	1,579	458	6,051	8,088
మదనపల్లె	1,931	483	7,953	10,367
మొత్తం	12,188	3,432	42,450	58,070

» వారిపై ఎందుకీ వివక్ష

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదల పక్కా గృహాలకు ఇచ్చిన అదనపు నిధులను వెనక్కు తీసుకుంటామని, ఇంటిని రద్దు చేస్తామన్న హెచ్చరికల నోటీసుల అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ వర్గాల్లో అత్యధికులు పేదలే కావడంతో ఇళ్ల నిర్మాణాలపై ప్రభావం కనిపిస్తోంది.

» వైఎస్ జగన్ ఉదారత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చూపించిన ఉదారత ఏ ముఖ్యమంత్రి చూపలేదు. అంతకుముందు పక్కా ఇళ్లు మంజూరు చేసినా ఇంటికి అందించిన యూనిట్ విలువ సొమ్మును ప్రతి నెలా తిరిగి కంతుల వారీగా చెల్లించేలా రుణాలు ఇచ్చేవారు. ఒక్కో నియోజకవర్గానికి ఇన్నేసి ఇళ్లే అంటూ రేషన్ కోటాలా ఇళ్లు కేటాయించేవారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక అవసరమైనన్ని గృహాలను మంజూరు చేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ విధానాలకు స్వస్తి పలికారు. జిల్లాలో 78,221 మందికి పేదలకు పక్కా గృహాలను మంజూరు చేశారు. వీరికి లేఔట్లు, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించారు. ఒక్కో లబ్ధిదారునికి తిరిగి కట్టనవసరం లేని రూ.1.80 లక్షలు అందించారు. ఇదికాక రుణంగా ఒక్కొక్కరికి రూ.35 వేల రుణం మంజూరు చేయించారు. లేఔట్లలో కోట్లు ఖర్చు చేసి సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ పేదలపై కక్ష కట్టి వ్యవహరిస్తోంది.

సమస్యను వదిలేసి...

జిల్లాలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా పేదలకు 78,221 మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాక ముందు దాకా ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా జరుపుకున్నారు. కూటమి అధికారంలోకి రావడంతోనే పనుల్లో జాప్యం నెలకొంది. దీనిపై క్షేత్రస్థాయిలో సమీక్షించి నిర్మాణాలపై సరైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తోంది. దీంతో ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ఏటా విధిస్తున్న లక్ష్యాలను అందుకోలేని పరిస్థితి నెలకొంది. అసలు సమస్య ఎక్కడుంది, ఎందుకీ పరిస్థితి నెలకొంది, లబ్ధిదారులకు ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలు, తొలగించాల్సిన ఇబ్బందులను విస్మరించింది. దీని ఫలితమే జిల్లాలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ప్రభావం చూపుతోంది.

కలిసి కట్టుగా దోమలను నివారిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య

రాయచోటి జగదాంబసెంటర్: అందరూ కలిసి కట్టుగా దోమలను నివారించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు.ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం రాయచోటిలోని శివ నర్సింగ్ కాలేజీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమలు కుట్టడం ద్వారా మలేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఆడ అనాఫిలస్ దోమలు మలేరియా పరాన్నజీవిని మోసుకుపోతాయని, ఇవి కుట్టినప్పుడు పరాన్నజీవి మనుషుల రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తుందన్నారు. దోమల నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలను వాడాలని సూచించారు. సర్ రోనాల్డ్‌రాస్ అనే శాస్త్రవేత్త 1902 ఆగస్టు 20న దోమలో మలేరియా పరాన్నజీవిని కనిపెట్టిన రోజు అని చెప్పారు. ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, శివ నర్సింగ్ కళాశాల డైరెక్టర్ భాస్కర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ మహమ్మద్‌రఫీ, బలరామరాజు, సబ్ యూనిట్ అధికారి జయరాం, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులునాయక్, ఎల్‌టీ శివ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

సిద్దవటం (ఒంటిమిట్ట): సిద్దవటం 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆర్‌బీఎస్‌కె జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేయకూడదని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులకు స్కానింగ్ తీసిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు ఇవ్వాలే తప్ప పుట్టబోయే బిడ్డ వివరాలు తెలియజేయరాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నగేష్, డాక్టర్ ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ డి.నారాయణపల్లికి చెందిన రెడ్డిశేఖర్ (32) అనే వ్యక్తి ఈ నెల 17న వ్యవసాయ బోరు వద్ద విషద్రావణం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రెడ్డిశేఖర్ బుధవారం మృతి చెందాడు. కడుపు నొప్పి తాళలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. టూటౌన్ పరిధిలోని గౌతమీనగర్ చీకలగుట్టలో నివాసం ఉంటున్న ఆనంద్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఇంటి వద్దే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నీట మునిగి గొర్రెల కాపరి మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని దేవప్పకోట పంచాయతీ మిట్టసోంపల్లికి చెందిన ఆవుల శంకరప్ప (55) అనే గొర్రెల కాపరి బుధవారం నీట మునిగి మృతి చెందాడు. తన గొర్రెలకు దాహం తీర్చేందుకు సమీపంలోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు జారి నీట మునిగాడు. అతనికి ఈత రాకపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి కుమారుడు మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు.

నలుగురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

రాయచోటి జగదాంబసెంటర్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నలుగురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెత్త సంపద కేంద్రాలు కలిగి ఉన్నా చెత్త సేకరణ జరపకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేశామన్నారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ పి.ఓబులమ్మ, గాలివీడు మండలం నూలివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.ఆంజినేయులు నాయక్, వీరబల్లి మండలం ఓదివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి టిఎం రెహమాన్, చిన్నమండెం మండలం పడమటికోన గ్రామ పంచాయతీ సర్పంచ్ టి.జమీర్‌హుస్సేన్ ఉన్నారు.

గొడవలో మహిళలకు గాయాలు

మదనపల్లె రూరల్ : పశువులు వరిపైరు మేశాయన్న కారణంగా జరిగిన గొడవలో మహిళలకు గాయాలైన ఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ బొంగువారిపల్లెకు చెందిన పాపులమ్మ వరి పంటను సాగుచేయగా, అదే గ్రామానికి చెందిన మునెప్ప పశువులు పొలాన్ని మేయడంతో ఈ విషయమై పాపులమ్మ, మునెప్ప వర్గీయులను దూషించింది. ఇరువర్గాల దాడిలో మునెప్ప వర్గీయులు విజయలక్ష్మి, పాపులమ్మలపై కర్రలతో దాడిచేయగా గాయపడ్డారు. పాపులమ్మ వర్గీయులు చేసిన దాడిలో మునెప్ప కుటుంబ సభ్యురాలు నందిని గాయపడింది. బాధితులు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టణ శివారు ఇళ్లే టార్గెట్.!

- వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- హడలెత్తిపోతున్న ప్రజలు





చోరీలు జరుగుతున్న పట్టణ శివారు ఇళ్లు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో శివారు ఇళ్లే టార్గెట్‌గా దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఓ వైపు గంజాయి ముఠాసభ్యులు మరోవైపు బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల సంచారంతో పట్టణ ప్రజలు హడలెత్తిపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ పట్టణం రోజురోజుకు వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకొనేవారి సంఖ్య పెరిగిపోతోంది. నాలుగు మండలాల ప్రజలు ఇక్కడ ఇళ్ల కట్టుకొని నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించుకొంటున్న ఇళ్లతో పాటు గ్రామానికి శివారు ప్రాంతాల్లో నివాసముండే ఇళ్లలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల నిర్మాణంలో ఉండే ఇళ్లలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇంటి నిర్మాణంలో వినియోగించే వస్తువులతోపాటు మెటీరియల్‌ను చోరీ చేసుకువెళుతున్నారు. పట్టణంతో పాటు ఇందిరమ్మకాలనీ, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం ఉన్న ప్రాంతాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. మోటార్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, గ్రానైట్ యంత్రాలతో పాటు వివిధ రకాల వస్తువులను చోరీ చేస్తున్నారు. దీంతో ఇంటి నిర్మాణం వద్ద వస్తువులు ఉంచాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. దీంతో పలువురు రాత్రిళ్లు కాపలా ఏర్పాటు చేసుకొంటున్నారు.

వీటితోపాటు గ్రామ శివారు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకొన్న చోట ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. చిన్న పిల్లల సైకిళ్లు, ఇళ్ల పరిసరాల్లో ఉంచిన వస్తువులను రాత్రిళ్లు చోరీ చేస్తున్నారు. దీంతో రాత్రిళ్లు పట్టణ శివారు ప్రాంతాల్లో సంచరించాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో పాటు గంజాయి మత్తుకు అలవాటు పడిన పలువురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు. స్థానిక బస్టాండులోనూ ఇటీవల వరుసగా మూడు చిల్లర దుకాణాల్లో చోరీలు జరిగాయి. రేకుల షెడ్లు పైకప్పు రేకులను తొలగించి దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలకు సంబంధించి పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీస్ స్టేషన్‌కు చేరని కేసులు ఎన్నో ఉన్నాయి. చోరీలు జరిగినా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు పలువురు భయపడి మిన్నకుండిపోతున్నారు. దీంతో దుండగులు పట్టణంలో యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పట్టణ శివారు ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలపై గట్టి నిఘా పెట్టాం. చోరీ జరిగిన ఇళ్లకు సంబంధించిన యజమానులు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఇళ్ల పరిసరాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే మాకు సమాచారం ఇవ్వాలి.
– రఘురామ్, ఎస్ఐ, గుర్రంకొండ.



జాతీయ స్థాయి శిక్షణా కార్యశాలకు ఉపాధ్యాయుడి ఎంపిక

చిట్వేలి : శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధనా మండలి వారు జిజ్ఞాస కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా 30 మంది ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.శివనారాయణ గౌడ్ బెంగళూరులోని జాతీయ వైమానిక అంతరిక్ష ప్రయోగశాలలో ఏరో డైనమిక్స్ విమాన విడిభాగాలు, నానో మెటీరియల్స్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి సంస్థ డైరెక్టర్, జిజ్ఞాస మోడల్ అధికారి డాక్టర్ వీపీఎస్ నాయుడు ద్వారా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు, ఉపాధ్యాయ సిబ్బంది శివనారాయణ గౌడ్‌ను అభినందించారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న శివనారాయణ

మామిడిలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలి

లక్కిరెడ్డిపల్లి : మామిడిలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడంతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఉద్యానశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దప్పేపల్లి, కోనంపేట, మద్దిరేవుల గ్రామాలలోని మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన మొక్కలతోపాటు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతు పొలంలో ఆర్కబోరల్ కంట్రోల్ అనే మందు కాండం తొలిచే పురుగు నివారణకు వాడే విధానం గురించి వివరించారు. అనంతరం ఉద్యానశాఖ అధికారి సింధూరి మాట్లాడుతూ రైతులు సమగ్రమైన యాజమాన్య పద్ధతులు వాడటం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కేశవయ్య, చంద్రమ్మ, ఉద్యాన సిబ్బంది, మామిడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



మామిడి రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస

వైష్ణవి హత్య కేసులో కీలక మలుపు

లై డిటెక్టర్ పరీక్షకు హాజరు కావాలంటూ తల్లిదండ్రులకు నోటీసులు

జమ్మలమడుగు : గండికోటలో హత్యకు గురైన వైష్ణవి మిస్టరీని ఛేదించే విషయంలో కీలక మలుపు చోటు చేసుకుంది. పోలీసులు తల్లిదండ్రులకు లై డిటెక్టర్ పరీక్షకు హాజరు కావాలంటూ కోర్టు ద్వారా నోటీసులు అందించినట్లు సమాచారం. జూలై 14వతేదీన వైష్ణవి లోకేష్ అనే యువకుడితో కలిసి గండికోటకు వెళ్లింది. తిరిగి లోకేష్ ఒక్కడే గండికోట నుంచి బయటికి వచ్చాడు. గండికోటలో వైష్ణవి హత్యకు గురి కావడంతో మొదట పోలీసులు లోకేష్‌నే నిందితుడిగా అనుమానించారు. అయితే లోకేష్ బయటికి వచ్చిన సమయంలో లోపల బాలిక బతికే ఉందని ఆధారాలు దొరికాయి. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఈ హత్య చేయించారా లేక వారే చేశారా అన్న కోణంలో పలు మార్లు విచారణ చేపట్టినా ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో కోర్టు ద్వారా (పాలిగ్రాఫ్)లై డిటెక్టర్ పరీక్షకు హాజరు కావాలంటూ జమ్మలమడుగు కోర్టు ద్వారా నోటీసులు పంపించినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులను పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై నిరాహార దీక్ష చేపడతా



దివ్యాంగులతో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై తాను నిరాహార దీక్ష చేపడతానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగుల ఉసురు తప్పక తగులుతుందన్నారు. ఆయన పింఛన్లను తొలగించిన దివ్యాంగులతో కలసి బుధవారం సాయంత్రం తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 66.39 లక్షల పింఛన్లు ఉండగా, ఇప్పుడు 62.19 లక్షల పింఛన్లు మాత్రమే ఉన్నాయని, 4.19 లక్షల పింఛన్లను ప్రభుత్వం తొలగించిందన్నారు. గత 14 నెలల్లో ప్రభుత్వం ఒక్కరికీ కొత్త పింఛన్ మంజూరు చేయలేదని పేర్కొన్నారు. అలాగే గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కొత్త పింఛన్లను ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు చేయకపోవడాన్ని బట్టి పేదలపై ఆయనకు ఏ మాత్రం ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి 581 మందికి పింఛన్లను తొలగిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతుందని అనుకున్నామే కానీ ఓటేసిన సాధారణ పేదలను కూడా ఇబ్బంది పెడుతోందన్నారు.

ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం

జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మంచం మీద నుంచి లేవలేని వారికి రూ.10వేలు, పెరాలసిస్ వ్యాధి గ్రస్తులకు రూ.5వేలు పింఛన్ ఇస్తుండగా, చంద్రబాబు మంచం మీద ఉన్న వారికి రూ.15వేలు, పెరాలసిస్ వ్యాధి గ్రస్తులకు రూ.10వేలు చొప్పున పెంచుతున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారని రాచమల్లు తెలిపారు. ఇప్పుడు ఈ విధంగా వికలత్వం శాతం తక్కువగా ఉందని అసలుకే ఎసరు పెట్టారన్నారు.

దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా



టీడీపీ కార్యకర్త చదును చేసిన భూమి



గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)

అట్లూరు : బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపిస్తే అక్కడ కూటమి నాయకులు, కార్యకర్తలు వాలిపోతున్నారు. మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 60, 61 లలో సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే టీడీపీకి చెందిన ఓ కార్యకర్త గత రెండు రోజులుగా యంత్రాలతో చదును చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ భూమిలో ఇది ప్రభుత్వ భూమి, ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ అధికారం మాదే కదా హెచ్చరిక బోర్డులు ఏమవుతాయని అతిక్రమించి చదును చేయడం మండల ప్రజలను విస్మయానికి గురిచేసింది. గతంలో ఈ భూమి ప్రజా ప్రయోజనాల అవసరాల కోసమని కేటాయించామని, అయితే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వ్యక్తి ఈ విలువైన భూమిని ఆక్రమించడం ఏమిటని స్థానిక టీడీపీ నాయకులే ఆరోపిస్తున్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు..

టీడీపీ కార్యకర్త సర్వే నంబర్ 60, 61 లలో సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని బుధవారం స్థానిక తహసీల్దారుకు ఎస్.వెంకటాపురం కాలనీకి చెందిన యేసన్న, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కాలనీ వాసులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడి కాలనీ వాసుల ప్రయోజనాలకు ఉంచాలని కోరారు.

తహసీల్దార్ వివరణ..

ఈ విషయమై తహసీల్దార్ సుబ్బలక్షుమ్మను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే అక్కడికి సిబ్బందిని పంపించి పనులు నిలుపుదల చేయించామన్నారు. సంబంధిత వ్యక్తి తనకు ఆ భూమిపై హక్కు పత్రాలు ఉన్నాయని వివరణ ఇచ్చారని, సంబంధిత పత్రాలను పరిశీలించిన తర్వాత ఆర్డీఓకు నివేదిక పంపుతామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు ఆ భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

శభాష్.. వివేక్

– కుందూలో కొట్టుకుపోతున్న వృద్ధురాలిని కాపాడిన యువకుడు



వృద్ధురాలిని కాపాడిన తీరును ఎస్ఐకు వివరిస్తున్న వివేక్

రాజుపాళెం : పాపం.. ఆ అవ్వకు ఎంత కష్టమొచ్చిందో.. ఎవరికీ చెప్పుకునే మార్గం లేదో.. ఏమో.. జీవితంపై విరక్తి చెంది కుందూ నదిలో దూకింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఓ యువకుడు గమనించి సాహసం చేసి నీళ్లలోకి దూకి ఆమెను రక్షించాడు. వివరాలు ఇలా..

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామానికి చెందిన గుర్రమ్మ (68) రాజుపాళెం మండలం వెల్లాల గ్రామ సమీపంలోని కుందూనదిలో దూకేందుకు అటువైపు వెళ్లింది. అయితే ఆ సమయంలో కుమ్మరపల్లె గ్రామానికి చెందిన భజంత్రి వివేకానంద ద్విచక్ర వాహనంలో ఆ దారిలో వెళుతున్నాడు. వృద్ధురాలు నీళ్ల వైపు వెళ్తుండటం గమనించి తన వాహనాన్ని ఆపి ఆమెను అనుసరించాడు. అంతలోనే ఆమె కుందూ నది పాత వంతెన మెట్ల వద్ద నీళ్లలో కొట్టుకుపోతూ కనిపించింది. వెంటనే ఏమాత్రం ఆలోచించకుండా భారీగా ప్రవహిస్తున్న నీళ్లలోకి దూకి వృద్ధురాలిని బయటకు తీశాడు. ఎందుకు నదిలో దూకాల్సి వచ్చిందని వివేక్ ఆమెను అడుగగా సమాధానం చెప్పలేక పోయింది. ఈ విషయాన్ని ఎస్ఐ వెంకటరమణకు, సచివాలయ ఉద్యోగులకు వివేక్ తెలపడంతో వెంటనే వారంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్రమ్మ వివరాలను ఎస్ఐ అడిగి తెలుసుకొని కుమారులను, బంధువులను పిలిపించారు. చికిత్స నిమిత్తం చాగలమర్రిలోని ఆసుపత్రికి తరలించారు. ఆమె కోలుకోవడంతో కుమారుడు ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, వృద్ధురాలిని కాపాడిన వివేక్‌ను ఎస్ఐతో పాటు ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ రెడ్డి, మహిళా పోలీసు షాహిదా, సచివాలయ ఉద్యోగులు, గుర్రమ్మ బంధువులు ప్రశంసించారు.

ఫిలాటెలి స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప పోస్టల్ డివిజన్ పరిధిలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీన్‌దయాళ్ స్పర్శ యోజన ఫిలాటెలి స్కాలర్ షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. బుధవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 -26 విద్యా సంవత్సరానికి ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించారన్నారు. మంచి విద్యా రికార్డు, ఫిలాటెలి అభిరుచి కలిగిన విద్యార్థులకు ఫిలాటెలి క్విజ్, ప్రాజెక్ట్ ఆధారంగా స్కాలర్‌షిప్ ఇస్తారన్నారు. నెలకు రూ. 500 చొప్పున ఏడాదికి రూ. 6 వేలు ఇస్తారన్నారు. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలలో 6, 9 తరగతుల మధ్య చదువుతూ ఉండాలన్నారు. పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ సభ్యుడిగా ఉండటం లేదా వ్యక్తిగత ఫిలాటెలి డిపాజిట్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ఈ ఫిలాటెలి రాత పరీక్ష సెప్టెంబర్ 30న ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 16 లోపల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పోస్టాఫీసులో సంప్రదించవచ్చన్నారు.

బనకచర్ల ప్రాజెక్టు మరో కాళేశ్వరమే

మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి




ఖాజీపేట : ప్రభుత్వం చేపట్టబోతున్న బనకచర్ల ప్రాజెక్టు మరో కాళేశ్వరంగా మారుతుందని మాజీ మంత్రి డాక్టర్ డీఎల్ రవీంద్రారెడ్డి విమర్శించారు. ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టుకు సుమారు రూ.80వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. చిన్న చిన్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. రాజోలు జలాశయం నిర్మాణానికి రూ.1,300 కోట్లు నిధులు అవసరమని చెప్పారని, దానికే నిధులు లేనప్పుడు బనకచర్ల ప్రాజెక్టుకు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు మరమ్మతుల కోసం, అలాగే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సూచించారు. ప్రజల కనీస అవసరాలను ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. వాట్సాప్ పాలన, క్వాంటామ్ వ్యాలీ, పీ-4, ఏఐ... ఇలా హైటెక్ ఆలోచనలు మంచివే అయినా, అమలు తీరు ఎలానో చూడాలన్నారు. ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క కొత్త పింఛను ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. మైదుకూరు నియోజక వర్గంలో రోడ్లు దారుణంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రిలో మందులు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో మంత్రులు పల్లెల్లో తిరిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. సంక్షేమ పథకాలతోపాటు ప్రజల కనీస అవసరాలను గుర్తించి పనులు చేయకపోతే కూటమి పాలన కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

అనుమానాస్పద మృతి కేసు హత్య కేసుగా మార్పు

మదనపల్లె రూరల్ : అనుమానాస్పదంగా మృతి చెందిన పశ్చిమబెంగాల్ యువకుడి కేసును పోస్టుమార్టం నివేదిక ఆధారంగా హత్యకేసుగా మార్పు చేస్తున్నట్లు రైల్వే సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఈనెల 16వ తేదీ సీటీఎం-అంగళ్లు రోడ్డులోని రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాక్ పక్కన పశ్చిమబెంగాల్ ముషీరాబాద్ ఇమామ్‌నగర్‌కు చెందిన ఖదీర్(30) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఘటనపై రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, పోస్టుమార్టం నివేదికలో ఖదీర్ హత్యకు గురైనట్లుగా నివేదిక అందింది. దీంతో రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతి కేసును హత్యకేసుగా మార్పుచేశారు. అయితే ఈ కేసులో గంజాయి నిందితులు అనుమానితులుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కేసుకు సంబంధించి ఇద్దరు అనుమానితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

అటవీ ఉద్యోగులపై శ్రీశైలం ఎమ్మెల్యే దాడి అమానుషం



కేవీ సుబ్బయ్య, అటవీ శాఖ ఉద్యోగుల సంఘం

రాజంపేట : శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి , ఆయన అనుచరులు , విధులు నిర్వహిస్తున్న అటవీ ఉద్యోగులను కిడ్నాప్ చేసి, వారిపై దాడి చేయడం అమానుషమని రాష్ట్ర అటవీ శాఖ జూనియర్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కేవీ సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం రాత్రి శ్రీశైలం చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న డీఆర్వో, ఇద్దరు బీట్ అధికారులు, సిబ్బందిపై ఎమ్మెల్యే దౌర్జన్యానికి పాల్పడం దారుణమన్నారు. అతిథి గృహంలో బంధించి చిత్రహింసలు పెట్టారన్నారు. గాయపడినవారంతా ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందినవారేనన్నారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అటవీ శాఖమంత్రి పవన్ కళ్యాణ్‌లు తక్షణమే స్పందించాలన్నారు. ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి(65) ఒకరు మృతి చెందాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన అతనికి జీఈ వార్డులో చేర్పించి చికిత్స అందించారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో అతను మంగళవారం రాత్రి మృతి చెందాడు.

పట్టపగలే బంగారు దుకాణానికి కన్నం

25 తులాల బంగారు నగలు చోరీ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని మోక్షగుండం వీధిలో పట్టపగలే బంగారు దుకాణానికి దొంగలు కన్నం వేశారు. మహబూబ్‌షరీఫ్‌కు చెందిన షాపులో సుమారు 25 తులాల మేర బంగారును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీనివాసనగర్‌కు చెందిన దరూబాయిగారి మహబూబ్‌షరీఫ్ కొన్నేళ్ల నుంచి దర్గాబజార్ సమీపంలోని మోక్షగుండం వీధిలో బంగారు నగల తయారీ షాపును నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో షెట్టర్‌కు తాళం వేసి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి 4.30 గంటల సమయంలో దుకాణం తెరిచేందుకు రాగా షెట్టర్ తాళం తీసి ఉంది. దీంతో పూర్తిగా షెట్టర్ తీసి చూడగా పెట్టెలో బంగారు నగలు కనిపించలేదు. నగలు తయారు చేసేందుకు కస్టమర్ల నుంచి తీసుకున్న సుమారు 25 తులాల మేర ఉన్న బంగారు కనిపించలేదు. మెయిన్ బజార్‌లోని వ్యాపారులు, స్వర్ణకారులందరూ మధ్యాహ్న సమయంలో దుకాణాలను మూసి ఇళ్లకు వెళ్తారు. ఆ సమయంలో వీధులన్నీ నిర్మానుష్యంగా ఉంటాయి. ఈ క్రమంలో దొంగలు నకిలీ తాళాలతో తాళం తీసి చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది బంగారు షాపులో వేలి ముద్రలను సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. నగల తయారీ షాపు యజమాని మహబూబ్ షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.